క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మహానంది: నంద్యాలలోని క్రాంతినగర్ వద్ద ఉన్న సబ్‌స్టేషన్‌లో 220 కేవీ విద్యుత్ లైన్ పనుల కారణంగా శనివారం మహానంది మండలంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వెలుగోడు: మండలంలోని విద్యుత్ సబ్‌స్టేషన్లలో నిర్వహణ పనుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రవీంద్ర నాయక్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అర్చకుడికి సన్మానం

మహానంది: వినాయకచవితి పర్వదినం, నిమజ్జనం సందర్భంగా అయ్యన్ననగర్ వద్ద ఉన్న తెలుగుగంగ ఘాట్ వద్ద అర్చకుడిగా సేవలు అందించిన పుట్టుపల్లె గ్రామానికి చెందిన రామయ్యను శుక్రవారం సన్మానించారు. గణేశ్ కేంద్ర మహోత్సవ సమితి ప్రతినిధులు సత్యం, సుబ్బరామయ్య, నాగపుల్లయ్యలు రామయ్యను సన్మానించి వస్త్రాలు సమర్పించారు.

వారం నుంచి రోడ్డు పక్కనే..

మహానంది: అబ్బీపురం నుంచి బొల్లవరం గ్రామానికి వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన వారం నుంచి ఓ బైక్ ఉండడం చర్చనీయాంశమైంది. దీన్ని గమనించిన రైతులు శుక్రవారం పాత్రికేయుల దృష్టికి తీసుకొచ్చారు. అబ్బీపురం సమీపంలోని దుర్గమ్మ గుడి వద్ద బైకు రోడ్డు పక్కన ఉందని, మరమ్మతులు ఉంటే ఇన్ని రోజులు ఉంచుతారా అంటూ పలువురు తెలిపారు. ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు.

ఆర్థిక సాయం

పాములపాడు: మండలంలోని తుమ్మలూరు గ్రామ పంచాయతీ మజరా గ్రామం క్రిష్టారావుపేట లో నక్కా మహేష్(33) గుండెనొప్పితో మృతి చెందగా ఆ కుటుంబానికి ఆదుకునేందుకు శుక్రవారం జెడ్పీటీసీ జ్యోతి రామలింగేశ్వరరెడ్డి, సర్పంచు వరప్రసాద్ రూ. 5వేల చొప్పున రూ.10వేల నగదును మృతుడికి భార్య మహేశ్వరికి అందజేశారు. సర్పంచు వరప్రసాద్ మాట్లాడుతూ ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నారని, ధైర్యంగా ఉండి పిల్లల భవిష్యత్ కోసం పాటుపడాలని మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చారు.

చెత్త డబ్బాలు మంజూరు

వెలుగోడు: మండలంలోని 8 గ్రామ పంచాయతీలకు 17,578 చెత్త డబ్బాలు మంజూరైనట్లు ఈఓఆర్డీ అనంత సేన తెలిపారు. గుంతకందాల, వెలుగోడు, బోయరేవుల, మోత్కూరు, మాధవరం, అబ్దుల్లాపురం, వేల్పనూరు, రేగడగూడూరు గ్రామాల్లో తడి, పొడి చెత్త సేకరణ నిమిత్తం ప్రతి కుటుంబానికి ఒకటి చొప్పున డబ్బాలు మంజూరైనట్లు తెలిపారు. వీటిని ఆయా గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులకు అందజేయనున్నట్లు చెప్పారు.

టెలికాం సలహా కమిటీ సభ్యుల నియామకం

ఆత్మకూరు: నంద్యాల పార్లమెంట్ పరిధిలోని బీఎస్ఎన్ఎల్ (టెలికామ్) సలహా కమిటీ సభ్యులుగా పాములపాడు కురువ రమేష్, పాణ్యం చిట్టిబోయిన శ్రీనివాసయాదవ్, కల్లూరు మధు, ఆత్మకూరు గౌస్‌లాజం, నూనెపల్లె పెరుమాళ్ల విజయ్‌కుమార్‌లను శుక్రవారం నియమించారు. నియామకానికి సహకరించిన నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరికి టెలికామ్ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

మతిస్థిమితం లేని వ్యక్తి మృతి


రాము

శ్రీశైలంప్రాజెక్ట్: మతిస్థిమితం సరిగ్గా లేని వ్యక్తి సున్నిపెంట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించడంతో శుక్రవారం మృతిచెందాడు. వివరాలు.. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తెలంగాణ రాష్ట్రం, వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం ఏదుట్ల గ్రామానికి చెందిన జి.రాము తల్లి అలివేలుతో కలిసి 10 రోజుల క్రితం శ్రీశైలంకు వచ్చారు. తల్లీ,కొడుకు ఇద్దరికి మతిస్థిమితం సరిగ్గా లేకపోవడంతో ఇద్దరూ ఒకరికి ఒకరు తప్పిపోయారు. వారం రోజులుగా సున్నిపెంటలోని పాతపెట్రోల్ బంక్ సమీపంలో రాము నీరసించి పడిపోయి ఉన్నాడు. స్థానికులు గురువారం 108 ద్వారా ఆస్పత్రిలో చేర్పించారు. రాము మృతదేహానికి శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

నష్టపోయిన వరి రైతులను ఆదుకోవాలి

మహానంది: ఇటీవల కురిసిన వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన మసీదుపురం గ్రామానికి చెందిన వరి రైతులను ఆదుకోవాలని ఎంపీటీసీ సభ్యుడు మునగాల మల్లికార్జునరెడ్డి కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. మసీదుపురం పొలిమేరలో సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో వరి పంటకు నష్టం వాటిల్లిందన్నారు. గ్రామానికి చెందిన నల్లారెడ్డి రాజశేఖర్‌రెడ్డి, పోశం మోహన్‌రెడ్డి, మాళీశ్వరరెడ్డి తదితర రైతులు సాగు చేస్తున్న వరి నేలకొరిగిందని ఆవేదన చెందారు. విషయాన్ని వ్యవసాయ అధికారి నాగేశ్వరరెడ్డి దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. అధికారులు స్పందించి బాధిత రైతులకు పరిహారం వచ్చేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

నత్తనడకన వంతెన నిర్మాణం

- చిన్నపాటి వర్షానికే ఉప్పొంగుతున్న ఇసుక వాగు
- స్తంభిస్తున్న రాకపోకలు
- ఏడాది గడిచినా పూర్తి కాని వంతెన
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు


ఇసుకవాగుపై ఏడాది కాలంగా కొనసాగుతున్న వంతెన నిర్మాణ పనులు


పది రోజుల క్రితం కురిసిన వర్షాలకు ఉప్పొంగి ప్రవహిస్తున్న ఇసుక వాగు

జూపాడుబంగ్లా: మూడు మాసాల్లో పూర్తిచేస్తామన్న పారుమంచాల ఇసుకవాగు వంతెన నిర్మాణం పనులు ఏడాదిగడిచినా పూర్తి కాకపోవటంతో గ్రామస్తులు, ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పారుమంచాల గ్రామ శివారులో ఇసుక వాగు ప్రవహిస్తుంది. ఎగువ ప్రాంతాల్లో చిన్నపాటి వర్షం కురిసినా వాగు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో ప్రజలు, వాహనాల రాకపోకలు స్తంభించిపోతున్నాయి. సమస్యను స్థానిక నాయకులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ఎండీఆర్ ప్లాన్ కింద రూ.5 కోట్లు మంజూరు చేశారు. దీంతో 2023 ఆగస్టు 8న వంతెన నిర్మాణానికి అప్పటి ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి భూమిపూజ చేశారు. వాగుపై హైలెవెల్ వంతెన నిర్మాణం పనులు దక్కించుకొన్న ఎస్‌వీ కన్‌స్ట్రక్షన్స్ వారు మూడు మాసాల్లోగా నిర్మాణం పూర్తిచేస్తామని వెల్లడించారు. ఏడాది గడిచినా పనులు పూర్తి చేయకపోవటంతో చిన్నపాటి వర్షం కురిసినా వాగు ఉప్పొంగి రాకపోకలు స్తంభిస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

స్తంభిస్తున్న రాకపోకలు..

60 ఏళ్ల క్రితం నుంచి ఇసుకవాగుపై వంతెన నిర్మాణానికి నోచుకోకపోవటంతో చిన్నపాటి వర్షం కురిసినా రాకపోకలు స్తంభించిపోయేవి. ఈ దారి గుండా పారుమంచాల, తూడిచెర్ల, మిట్టకందాల, పాములపాడు, వాడాల, రేగడగూడూరు, వేల్పనూరు, వెలుగోడు గ్రామాలకు రాకపోకలు కొనసాగుతాయి. అలాగే పారుమంచాల గ్రామ ప్రజలు, రైతులు పొలాలకు వెళ్లాలన్నా, మండల కేంద్రమైన జూపాడుబంగ్లా, నియోజకవర్గ కేంద్రం నందికొట్కూరుకు వెళ్లాలన్నా ఇసుక వాగుదాటి వెళ్లాలి. వర్షం వచ్చి వాగు పొంగి పొర్లితే ప్రవాహం తగ్గుముఖం పట్టే వరకు రాకపోకలు నిలిచిపోతాయి. కొన్నిసార్లు రెండు మూడు రోజులు కూడా ప్రవాహం ఉంటుందని, ఆ సమయంలో తమ అవస్థలు వర్ణనాతీతమని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. 60 ఏళ్లుగా ఇదేతంతు కొనసాగుతుండగా జగనన్న పాలనలో వంతెన మంజూరు చేయటంతో ప్రజలు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.

నత్తనడకన పనులు..

రూ.5 కోట్లతో హైలెవెల్ వంతెన నిర్మాణం పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ మూడు మాసాల్లో పనులు పూర్తిచేస్తామని పేర్కొన్నప్పటికీ ఏడాది గడిచినా పనులు పూర్తికాలేదు. ఈ ఏడాది జూన్ నుంచి కురుస్తున్న వర్షాల ధాటికి పక్షం రోజులకోమారు ఇసుక వాగు ఉప్పొంగుతుండటంతో ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

వంతెన త్వరగా నిర్మించాలి



ఇసుకవాగుపై వంతెనను త్వరగా నిర్మించాలి. వంతెన నిర్మాణం పనులు ప్రారంభమై చాలా రోజులైనా పూర్తిచేయటం లేదు. వాగువస్తే గ్రామం నుంచి పొలాలకు వెళ్లాలన్నా, ఇతర గ్రామాలకు వెళ్లలేని దుస్థితి నెలకొంటుంది. అధికారులు చర్యలు తీసుకొని త్వరగా పూర్తిచేయించాలి.

– రంగస్వామి, పారుమంచాల

వాగువస్తే గ్రామం విడిచి వెళ్లలేం



గ్రామ సమీపంలో ఉన్న ఇసుకవాగు ఉప్పొంగిందంటే తగ్గే వరకు ఊరు విడిచి ఎక్కడికీ వెళ్లలేం. ఎంత అత్యవసరమైనా ఉండిపోవాల్సిందే. వాగుపై ఏడాది క్రితం వంతెన నిర్మాణం ప్రారంభించారు. ఇప్పటికీ పూర్తికాలేదు. అధికారులు త్వరగా వంతెన నిర్మిస్తే మాకు వాగు కష్టాలు తప్పుతాయి.

– వెంకటరమణ, పారుమంచాల

ఆరు మాసాల్లో పూర్తిచేయిస్తాం

పారుమంచాల ఇసుకవాగుపై రూ.5కోట్లతో ఏడాది క్రితం వంతెన నిర్మాణాన్ని ఎస్‌వీ కన్‌స్ట్రక్షన్స్ వారు ప్రారంభించారు. వాస్తవానికి మొదట్లో మూడు మాసాల్లో వంతెన పూర్తి చేస్తామన్నారు. ఎన్నికల కోడ్ రావడం, ఆ తరువాత బిల్లులు సకాలంలో రానందున పనులు మందగించాయి. మరో ఆరు మాసాల్లోగా పనులు పూర్తయ్యేలా చర్యలు చేపడతాం.

– మనోహర్, ఏఈ, ఆర్‌అండ్‌బీ

సబ్సిడీపై పశువుల దాణా

జూపాడుబంగ్లా: సబ్సిడీపై పశువులు, గొర్రెల యజమానులకు సంపూర్ణ మిశ్రమ దాణా అందజేస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రామాంజనేయ నాయక్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వర్షాల వల్ల పాడిపశువులకు అవసరమైన దాణా లభించని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించటంతో పాటు పాడిపశువులకు అవసరమైన సంపూర్ణ మిశ్రమ (టీఎంఆర్) దాణాను రాయితీపై అందజేస్తున్నట్లు చెప్పారు. సంపూర్ణ మిశ్రమ దాణ కిలో పూర్తి ధర రూ.15.80 కాగా రాయితీ రూ.9.30 పోనూ రైతులు కిలోకు రూ.6.50 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ దాణా తేలికగా జీర్ణం కావటంతో పాటు పాలదిగుబడి పెంచుతుందన్నారు. దూడలు, గొర్రెల బరువు పెరగటంతో పాటు నాణ్యమైన మాంసం లభిస్తుందన్నారు. అవసరమైన రైతులు గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల్లో, పశువైద్యశాలల్లో సంప్రదించాలని సూచించారు.

రాయితీపై చాఫ్‌కట్టర్ ..

దాణాతో పాటు రాయితీపై పశువుల పోషకులకు గడ్డికోత యంత్రాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. మూడు బ్లేడ్లతో 2హెచ్‌పీ యంత్రం పూర్తి ధర రూ.33,970 కాగా సబ్సిడీ రూ.13,588 పోనూ రైతులు రూ.20,382 చెల్లించాలన్నారు. అవసరమైన రైతులు జూపాడుబంగ్లా పశుసంవర్ధక కార్యాలయంలో పేర్లు నమోదు చేయించుకోవాలని చెప్పారు.

పల్లకీపై మహానందీశుడి విహారం


మహానందిలో స్వామివారికి పల్లకీ సేవ నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

మహానంది: మహానందిలో కొలువైన కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులకు శుక్రవారం రాత్రి పల్లకీ సేవను కనుల పండువగా నిర్వహించారు. వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని ఆధ్వర్యంలో పండితులు, అర్చకులు ముందుగా స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. అనంతరం శాస్త్రోక్తంగా పూజలు చేసి గోమాతలను పట్టువస్త్రాలతో ముస్తాబు చేసి పల్లకీ ఉత్సవం ముందు నడిపించారు. మేళతాళాలు, బాజా భజంత్రీల నడుమ ఆలయ ప్రాకారంలో పల్లకీ సేవ జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారికి దర్శించుకున్నారు. ఆలయ పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ హరినాథ్, అర్చకులు శరభయ్యశర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

మహానంది ఏఈఓకు గాయాలు

మహానంది దేవస్థానం ఏఈఓ ఓంకారం వెంకటేశ్వరుడుకు శుక్రవారం గాయపడ్డారు. నంద్యాల ఎస్‌బీఐ కాలనీలోని భూములను పరిశీలించి మహానంది వస్తుండగా చెరువుకట్ట మలుపు వద్ద మహానంది నుంచి వస్తున్న బస్సు డ్రైవర్ అజాగ్రత్తగా రావడంతో తప్పించుకోబోయి బైక్ అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. దీంతో కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి.

పోతిరెడ్డిపాడు నుంచి నీటి విడుదల పెంపు

జూపాడుబంగ్లా: వర్షాలు తగ్గటంతో పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి నీటి విడుదలను 20వేల నుంచి 25 వేల క్యూసెక్కులకు పెంచినట్లు ఏఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వర్షాల కారణంగా దిగువనున్న కాల్వల్లోకి వర్షం నీరు వచ్చి చేరుతుండటంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోతిరెడ్డిపాడు నుంచి నీటి విడుదలను తగ్గించామన్నారు. వర్షాలు తగ్గినందున 25వేల క్యూసెక్కులకు పెంచామన్నారు. ఎగువ ప్రాంతాల నుంచి శ్రీశైలం డ్యాంలోకి 76,152 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుండగా డ్యాంలో సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో 884.30 అడుగుల నీటి మట్టం ఉండగా పోతిరెడ్డిపాడు వద్ద 883.40 అడుగుల నీటిమట్టం నమోదైందని చెప్పారు. పోతిరెడ్డిపాడు నుంచి విడుదల చేసిన నీటిని బానకచర్ల నీటి నియంత్రణ సముదాయం నుంచి గాలేరు నగరి సుజల స్రవంతి కాల్వకు 14వేల క్యూసెక్కులు, తెలుగుగంగ కాల్వకు 10వేల క్యూసెక్కులు, కేసీ ఎస్కేప్ కాల్వకు వెయ్యి క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు బానకచర్ల ఏఈ దేవేంద్ర వివరించారు.

లోక్ అదాలత్‌లో కేసులకు సత్వర పరిష్కారం


మాట్లాడుతున్న జడ్జీలు

నందికొట్కూరు: జాతీయ లోక్‌అదాలత్‌లో కేసులను పరిష్కరించుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి ఎం.ఇందిరా ప్రియదర్శిని, జూనియర్ సివిల్‌జడ్జి దివ్య తెలిపారు. శుక్రవారం పట్టణంలోని కోర్టు చాంబర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. క్రిమినల్, సివిల్, తదితర కేసులను ఇరువర్గాలు రాజీ మార్గంలో పరిష్కరించుకోవాలనికోరారు. ఎక్కువ కేసులను రాజీ చేసేందుకు పోలీసులు అవగాహన కల్పించాలని చెప్పారు. టౌన్‌సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐలు పాల్గొన్నారు.

భూములపై విచారణ


గువ్వలకుంట్ల వద్ద క్షేత్రస్థాయిలో విచారణ చేస్తున్న అధికారులు

కొత్తపల్లి: మండలంలోని ఆయా గ్రామాల్లోని పంట పొలాలకు చెందిన భూములపై శుక్రవారం ఫారెస్ట్ రేంజ్ అధికారి పట్టాభి, డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న సిబ్బందితో కలసి విచారణ చేశారు. ముందుగా గువ్వలకుంట్ల గ్రామ సమీపంలోని ఎర్రగుంట గూడెం సమీపంలోని భూములను రైతులతో కలసి పరిశీలించారు. అలాగే.. ఎదురుపాడు పొలిమేరకు చెందిన కొత్తమాడుగుల సమీపంలో ఉన్న భూములను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆయా గ్రామాలకు చెందిన కొందరు రైతులు మా భూములు మాకు కావాలని హైకోర్టులో పిటిషన్ వేశారన్నారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఫారెస్టు, రెవెన్యూ అధికారులు కలసి విచారణ చేపట్టామన్నారు. గువ్వలకుంట్ల గ్రామంలో సర్వే నంబర్ 709 బిలో 144 ఎకరాల రెవెన్యూ భూమి ఉండేదన్నారు. అయితే సెంట్రల్ గెజిట్ ద్వారా 2011లో అటవీ శాఖకు రైతులు అప్పగించారన్నారు. కాగా కొందరు రైతులు ఆ భూములు సాగు చేసుకుంటున్నారన్నారు. దీంతో అటవీశాఖ అధికారులు ఆ భూములను సాగు చేయవద్దని రైతులకు తెలియజేశారు. దీంతో రైతులు కోర్టును ఆశ్రయించారని, హైకోర్టు ఉత్తర్వుల మేరకు భూములను పరిశీలించామని చెప్పారు. ఎదురుపాడు గ్రామంలో సర్వే నంబర్ 562లో 8 ఎకరాలను కూడా పరిశీలించామన్నారు. ఈ రెండు గ్రామాలకు గ్రామాలకు చెందిన భూములు క్షేత్రస్థాయిలో పరిశీలిన చేసి ఆ భూములు అటవీశాఖకు చెందినవేనని నిర్ధారించామని స్పష్టం చేశారు.

మల్లన్నకు నృత్యార్చన



నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళావేదికపై శ్రీకాకుళంకు చెందిన వెంకటేశ్వర మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ వారిచే సంప్రదాయ నృత్య ప్రదర్శన నిర్వహించారు. మహాగణపతిం, శివతాండవం, శివశివశంకర, ఆనందతాండవం, శివపంచాక్షరీస్తోత్రం, నమఃశివాయతే తదితర గీతాలకు, అష్టకాలు మొదలైన వాటికి వెంకటేశ్వర పట్నాయక్, కావ్య, శైలు, జయలక్ష్మి, శ్వేతారాణి, లక్ష్మీప్రితి, శ్రీదీక్షిత, ప్రణవి, స్నేహశ్రీగౌడ్, మధుశ్రీ, సింధు తదితరులు నృత్యప్రదర్శన చేశారు.

మండుతున్న కూరగాయల ధరలు


జూపాడుబంగ్లాలో శుక్రవారం నిర్వహించిన సంతలో కూరగాయల విక్రయం

జూపాడుబంగ్లా: మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన వారాంతపు సంతలో కూరగాయల ధరలు మండిపోవడంతో వినియోగదారులు కొనుగోలుకు వెనుకాడారు. మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు ఆయా గ్రామాల్లో నిర్వహించే వారాంతపు సంతలో వారానికో పర్యాయం కూరగాయలు కొనుగోలు చేస్తారు. జూపాడుబంగ్లాలో నిర్వహించిన వారాంతపు సంతలో ఏ కూరగాయ కొనుగోలు చేద్దామన్నా ధర కిలో రూ.60 కి పైగా చెబుతుండటంతో వినియోగదారులు ఖంగుతిన్నారు. టమాట మినహా, పచ్చిమిర్చి, బెండ, కాకర, చిక్కుడు, వంకాయ ఇలా ఏ కూరగాయ కొనుగోలు చేసినా కిలో రూ.60కు పైగా విక్రయించారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం

నందికొట్కూరు: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమ బాటకు సిద్ధం కావాలని మాలమహానాడు జిల్లా నాయకుడు సాంబశివుడు, నియోజకవర్గ అధ్యక్షుడు ఏసీహెచ్ నగేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని జై కిసాన్ పార్కులో ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలలందరూ ఉద్యమించాల్సి సమయం ఆసన్నమైందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వర్గీకరణకు మద్దతు ప్రకటిస్తే భవిష్యత్‌లో పుట్టగతులుండవని హెచ్చరించారు. నాయకులు డాక్టర్ రాజు, అచ్చన్న, అర్లప్ప, ఎర్రన్న, కృపాకర్, మల్లయ్య, చరణ్ పాల్గొన్నారు.

గాలేరు వాగు దాటే క్రమంలో ఎడ్ల బండి బోల్తా

-రెండు ఎద్దులు మృతి


మృతి చెందిన వృషభాలు

వెలుగోడు: మండల పరిధిలోని బోయ రేవుల గ్రామ శివారులో ఉధృతంగా ప్రవహిస్తున్న గాలేరు వాగు దాటే క్రమంలో రెండు ఎద్దులు మృతి చెందాయి. శుక్రవారం వెలుగోడు పట్టణానికి చెందిన కురువ వెంకటరమణ బోయ రేవుల గ్రామ పొలిమేరలో ఎద్దుల బండి బాడుగకు తీసుకున్నాడు. గాలేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నా దాటే ప్రయత్నం చేశాడు. నీటి ప్రవాహానికి బండి బోల్తా పడి కొట్టుకుపోయింది. గమనించిన రైతులు బండిపై ఉన్న కురువ వెంకటరమణను కాపాడి ఒడ్డుకు తీసుకొచ్చారు. రెండు ఎద్దులు మృతి చెందాయి. దీంతో రైతు కన్నీరు మున్నీరయ్యాడు. వీటి విలువ 1,50,000 ఉంటుందని.. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

వివిధ కేసుల్లో ముగ్గురికి రిమాండ్

కొత్తపల్లి: వివిధ కేసుల్లో ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ కేశవ శుక్రవారం తెలిపారు. అయన తెలిపిన వివరాల మేరకు.. గువ్వలకుంట్ల మజరా గ్రామమైన బండినాయిని పాలెంకు చెందిన జ్యోతి కాపురానికి రాలేదని భర్త తలారి శివలింగం ఈనెల 5 న దాడికి పాల్పడిన ఘటనలో భార్య ఫిర్యాదు మేరకు శివలింగంపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి ఆత్మకూరు కోర్టులో హాజరు పరుచగా మెజిస్ట్రేట్ రిమాండ్ విధించినట్లు తెలిపారు. అలాగే..అత్మకూరు మండలం సిద్ధాపురం గ్రామానికి చెందిన ఈసం సంతోష్, ఇరుదిండ్ల రవి ఏపీ39ఎంజెడ్7437 నంబర్ పల్సర్ బైకుపై ట్యూబ్‌లో నాటుసారా తరలిస్తుండగా బావాపురం గ్రామ సమీపంలో దాడి చేసి అదుపులోకి తీసుకుని వారి నుంచి 30 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని, బైక్ సీజ్ చేశామని, ఇద్దరినీ అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా.. జడ్జి రిమాండ్ విధించినట్లు వెల్లడించారు.

రైతులకు అందుబాటులో ఎరువులు

వెలుగోడు: రైతులకు అందుబాటులో ఎరువులు ఉన్నాయని వెలుగోడు సొసైటీ సీఈఓ జంబులయ్య అన్నారు. శుక్రవారం స్థానిక సొసైటీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 20–20–0–13 రకం రూ.1,130, డీఏపీ రూ. 1350, యూరియా 266 విక్రయిస్తున్నట్లు సీఈఓ తెలిపారు. ఒక ఆధార్ కార్డుకు 5 బస్తాలు చొప్పున ఎరువులు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు... ఆత్మకూరులో..

ఏచూరి మరణం తీరని లోటు


శివపురంలో నివాళులర్పిస్తున్న దృశ్యం

శ్రీశైలంప్రాజెక్ట్: సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతికి సున్నిపెంటలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు శుక్రవారం నివాళులర్పించారు. సీఐటీయూ కార్యాలయం వద్ద ఏచూరి చిత్రపటానికి పూలు చల్లి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన సేవలను కొనియాడారు. నాయకులు నాగవెంకటేశ్వర్లు, నాగసైదయ్య, చిన్నమారెన్న, నాగరాజు, మల్లికార్జున, ఆవులయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: పట్టణంలోని డాక్టర్ ఎ.ధనుంజయ మీటింగ్ హాల్‌లో ఏచూరి సంతాప సభ ఏర్పాటు చేశారు. సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వి.ఏసురత్నం, పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్, మండల కార్యదర్శి నరసింహానాయక్, ఎం.రజాక్ మాట్లాడుతూ.. ఏచూరి మరణం కార్మిక వర్గానికి, రైతాంగానికి, దేశ ప్రజలకు తీరనిలోటని పేర్కొన్నారు. ఒక గొప్ప మేధావిని కోల్పోయామన్నారు. నాయకులు డి.రామ్‌నాయక్, ఎస్.స్వాములు, పి.సుధాకర్, సద్దాంహుసేన్, దినేష్ పాల్గొన్నారు. అలాగే స్థానిక అమలాపురం చెంచుగూడెంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి సీపీఎం మండల కార్యదర్శి నరసింహనాయక్, నాయకులు ఎం.నరసింహానాయక్, చెంచు వెంకటేశ్వర్లు నివాళులర్పించారు. ఉన్నత కుటుంబంలో పుట్టినా అట్టడుగు వర్గాల అభ్యున్నతికి జీవితాంతం కృషి చేశారన్నారు.

నందికొట్కూరు: భారత కమ్యూనిస్టు పార్టీ (మార్కిస్ట్) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి తీరని లోటని సీపీఐ జిల్లా నాయకులు రఘురామమ్మూర్తి అన్నారు. శుక్రవారం పట్టణంలోని జైకిసాన్ పార్కులో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాగేశ్వరరావు, శేఖర్‌నాయుడు,దిలీప్, వినోద్, హరి, రామిరెడ్డి, రాజు, రామకృష్ణ, అమర్నాథ్, రజిత, రంగమ్మ, జయరాణి, పాల్గొన్నారు.

కొత్తపల్లి: సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం ఆ పార్టీకే కాకుండా దేశానికి, కార్మిక, కర్షక, పీడిత ప్రజలకు తీరని లోటని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఏసురత్నం, మండల నాయకుడు ఎస్.స్వాములు అన్నారు. శుక్రవారం మండలంలోని శివపురం గ్రామ ఎస్సీ కాలనీలో ఆయన చిత్రపటానికి సీపీఎం సీనియర్ నాయకులు పక్కీరయ్య, చిన్నయ్య ఆధ్వర్యంలో నివాళులర్పించారు. జీ.దాసు, దానమయ్య, రాజేష్, ప్రేమ్, హనుమంతు, రంగస్వామి, ప్రదీప్, కమలమ్మ, హుసేనమ్మ, మాణిక్యమ్మ, శేషమ్మ, నారాయణ నాయక్, జయమ్మ, ప్రదీప్ పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


గువ్వలకుంట్లలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ సురేష్‌కుమార్ రెడ్డి

కొత్తపల్లి: మన చుట్టూ ఉన్న నేరస్తులు, మోసగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్‌కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని జి.వీరాపురం, గువ్వలకుంట్ల గ్రామాల్లో ఎస్ఐ ఎం.కేశవ ఆధ్వర్యంలో ప్రజలతో సమావేశం నిర్వహించి ఆన్‌లైన్ మోసాలు, వాహనాల నడిపేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. చిన్నపిల్లలకు, లైసెన్స్ లేని వారికి వాహనాలను ఇవ్వకూడదని చెప్పారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ రామాంజినాయక్

ఆత్మకూరు: విద్యతోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని.. బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని డీఎస్పీ రామాంజినాయక్ అన్నారు. ఆత్మకూరు పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో ప్రగతిశీల విద్యార్థి సమాఖ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ సభ్యులు 'విద్యార్థి చదువుకో.. గమ్యాన్ని చేరుకో' కార్యక్రమం పోస్టర్లను డీఎస్పీ రామాంజినాయక్ చేతులమీదుగా శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ప్రగతిశీల విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించనున్న విద్యార్థి చదువుకో గమ్యాన్ని చేరుకో కార్యక్రమాన్ని విద్యార్థులు జయప్రదం చేయాలని కోరారు. విద్యార్థుల్లో చైతన్యం కలిగించి చదువువైపు అడుగులు వేయించడమే కార్యక్రమ ఉద్దేశమని పేర్కొన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ప్రగతిశీల విద్యార్థి సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి దక్కకుమార్, నాయకులు సుమన్, రాజా, కృష్ణ, రాము పాల్గొన్నారు.